క్లుప్తంగా

సైబర్ నేరాలపై అప్రమత్తం



రాజులపేటలో సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న పెదపాడు ఎస్సై శుభశేఖర్

దెందులూరు: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, గుర్తు తెలియని వ్యక్తుల ఫోన్లు, మాట్లాడవద్దని, లింకులు ఓపెన్ చేయవద్దని, సెల్‌ఫోన్ వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని పెదపాడు ఎస్సై శుభశేఖర్ అన్నారు. సోమవారం జిల్లా ఎస్పీ కె. ప్రతాపశివకిషోర్ ఆదేశాల మేరకు రాజులపేటలో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. చట్టాలు, నేరాలు, సెక్షన్లపై సుదీర్ఘంగా వివరించారు.

రవీంద్రప్రసాద్‌కు జాతీయ బంగారు నంది అవార్డు



సొంగా రవీంద్రప్రసాద్‌కు జాతీయ బంగారు నంది అవార్డు బహూకరిస్తున్న దృశ్యం

దెందులూరు: గంగన్నగూడెం గ్రామానికి చెందిన సీఆర్‌డీఏ డివిజనల్ సర్వే అధికారి సొంగా రవీంద్రప్రసాద్ సోమవారం హైదరాబాద్‌లో జాతీయ బంగారు నంది అవార్డును, ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. విశ్వవిఖ్యాత ఆర్ట్స్ అండ్ కల్చరల్ అకాడమి గౌతమేశ్వర గోసంరక్షణ సమితి సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. తెలంగాణ ప్రముఖ సంఖ్యా శాస్త్రవేత్త శ్రీ దైవజ్ఞ శర్మ, గోసంరక్షణ సమితి చైర్మన్ ఆకుల విద్యాసాగర్ గురూజీ, డాక్టర్ ఎస్‌వీఆర్ వెంకటేష్ గురూజీ బంగారు నందిని, ప్రశంసా పత్రాన్ని, జ్ఞాపికను అందచేసి రవీంద్రప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. రక్తదాన సేవ భవిష్యత్ తరాలకు ఆదర్శనీయమని, ప్రాంతాలకు అతీతంగా రక్తదానం సరఫరాలో రవీంద్రప్రసాద్ చేస్తున్న సేవలను కొనియాడారు.

గ్రామ సభలో సమస్యల ఏకరువు



మేదినరావుపాలెంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

దెందులూరు: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, సర్పంచ్ ఎం.దుర్గాకుమారిరాజు అన్నారు. సోమవారం మీ కోసం– మీ చింతమనేని కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన గ్రామ సభలో తిమ్మన్నగూడెం, ముప్పవరం, రామారావుగూడెం, మేదినరావుపాలెంలోని ప్రజలు సమస్యలపై ఏకరువు పెట్టారు. గ్రామాల్లోని అంగన్‌వాడీ భవనం, శ్మశాన రహదారి అభివృద్ధి తదితర సమస్యలను ప్రజలు ఎమ్మెల్యేకు వివరించారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు మాగంటి నారాయణ ప్రసాద్ (మిల్లు బాబు), పార్టీ నాయకులు మెత్యూరి నాని, డాక్టర్ మధు, యలమర్తి శ్రీనివాసరావు, కమ్మ శివరామకృష్ణ, ఉద్యోగులు ఉన్నారు.

మద్దతు ధరలపై గ్యారెంటీ చట్టం చేయాలి



కైకరంలో కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న రైతు సంఘం నాయకులు

గణపవరం(ఉంగుటూరు): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు వ్యతిరేక బడ్జెట్‌పై నిరసన వ్యక్తం చేస్తూ ఏపీ రైతు సంఘం, ఏపీ కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో ఉంగుటూరు మండలం కైకరంలో సోమవారం ఆందోళన నిర్వహించారు. సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపు మేరకు కేంద్ర బడ్జెట్ పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె. అప్పారావు మాట్లాడుతూ రైతాంగ వ్యతిరేక, కార్మిక వ్యతిరేక కేంద్ర బడ్జెట్‌ను రైతులంతా వ్యతిరేకిస్తూ నిరసనలు తెలుపుతున్నారని, వ్యవసాయ రంగానికి నిధులు పెంచాలని, పోలవరం నిర్మాణానికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగానికి భారీగా నిధుల కోతపెట్టడం దారుణమన్నారు. దేశంలో 60శాతం మంది ఆధారపడిన వ్యవసాయ రంగాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. మద్దతు ధరల గ్యారంటీ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో చిత్తా వెంకటేశ్వరరావు, అల్లు గోవింద్, జె.శ్రీనివాస్,నాగేశ్వరరావు, నూకరాజు పాల్గొన్నారు.

విధ్వంసమే అజెండాగా పాలన



దెందులూరులో వైఎస్సార్ విగ్రహం చేతులను ధ్వంసం చేసిన దృశ్యం



ధ్వంసం చేసిన శిలాఫలకం



వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని ఇల్లును ధ్వంసం చేసిన దృశ్యం

- శిలాఫలకాలు, బోర్డుల ధ్వంసం
- అడ్డూఅదుపు లేకుండా దాడులు, దౌర్జన్యాలు
- వైఎస్సార్‌సీపీ నాయకులపై తప్పుడు కేసులు
- ఆందోళనలో ప్రతిపక్ష పార్టీల శ్రేణులు

దెందులూరు: గ్రామగ్రామాన శిలాఫలకాలు, ప్రభుత్వ కార్యాలయాలపై దాడి చేసి బోర్డుల ధ్వంసం, కొన్ని గ్రామ సచివాలయాల్లో కంప్యూటర్లు ధ్వంసం, ఒక గ్రామంలో పెట్రోలు బంకుల ధ్వంసం, మాజీ ముఖ్యమంత్రి, రైతు బాంధవుడు వైఎస్సార్ విగ్రహం చేతులు సైతం ధ్వంసం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని ఇంటిని ధ్వంసం చేసి, బైక్‌లపై పెట్రోలు పోసి తగులపెట్టారు. అక్కడితో ఆగకుండా ప్రభుత్వ కార్యాలయాలకు స్థలం దానం చేసిన దాత పేర్లను కూడా తొలగించారు. ఇది 50 రోజుల్లో దెందులూరు నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వంలో జరిగిన పరిణామాలు, అక్కడితో ఆగకుండా పార్టీ జెండా విషయంలో తలెత్తిన వివాదంలో మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని ఇంటిని ధ్వంసం చేసి అతనిపైనే ఎస్సీ, ఎస్టీ, హత్యాయత్నం కేసులతోపాటు , మరో రెండు కేసులు బనాయించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడకముందే కౌంటింగ్ రోజు నుంచే వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఇళ్లపై దాడులకు తెగపడ్డారు.టీడీపీ అధికారం చేపట్టిన తరువాత ప్రతి గ్రామంలోనూ ఊహించని విధంగా దాడులు జరుగుతున్న నేపథ్యంలో తీవ్ర ఆందోళనలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, ఏలూరు పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ నేత కారుమూరి సునీల్ కుమార్, దెందులూరు పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని ఇటీవల పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి గ్రామాల వారీగా జరిగిన దాడులు, దౌర్జన్యాలను వివరించారు.



వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందించిన కామిరెడ్డి నాని (ఫైల్)

దాడులు చేయడం దారుణం



గత ఐదేళ్లలో మేము ఎప్పుడైనా దాడులు, దౌర్జన్యాలు, విధ్వంసాలు చేశామా? మేము దాడులు, విధ్వంసానికి పాల్పడనప్పుడు టీడీపీ నాయకులెందుకు చేస్తున్నారో అర్థం కావడం లేదు. ప్రభుత్వ కార్యాలయాలపై బోర్డులు, శిలాఫలకాలు తొలగింపు దారుణం.

– శనిపల్లి విష్ణు, సర్పంచ్, సానిగూడెం

దాడిచేసి తప్పుడు కేసులు పెట్టడం మంచి సంప్రదాయం కాదు



మాపైనే దాడి చేసి, ఆస్తులు నష్టపరిచి, ఎదురు తిరిగి మాపైనే మర్డర్ కేసులు, ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టడం మంచి సంప్రదాయం కాదు. టీడీపీ నాయకులు భావితరాలకు ఈ విధానం ద్వారా ఏమి చెప్పదలుచుకున్నారో ఆలోచించాలి. అధికారం ఎవరికీ శాస్వతం కాదన్న విషయం గుర్తించాలి.

– నిట్టా లీలానవకాంతం, జెడ్పీటీసీ

విధ్వంసం చేస్తే ప్రజల్లో పరపతి పెరుగుతుందా?



గ్రామ గ్రామాన కూటమి నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు దాడులు చేస్తూ శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే ప్రజల్లో టీడీపీ పరపతి పెరుగుతుందా, జనం ఆదరిస్తారని వారు భావిస్తున్నారా? దీనిపై ఆపార్టీ నాయకులు ఆలోచించాలి. ఈ విధానం మంచిది కాదు.

– జినంపూడి రాము, వైఎస్సార్‌సీపీనేత, సత్యనారాయణపురం

కూటమి ముఖ్యనేతలు దాడులను ఖండించాలి



గ్రామాల్లో దాడులు, దౌర్జన్యాలు, కేసుల నమోదు, శిలాఫలకాల ధ్వంసానికి పాల్పడుతుంటే జనసేన, టీడీపీ, బీజేపీ నేతలు మౌనంగా ఉండటానికి అర్థమేమిటి. విధ్వంసం సృష్టించడం కూటమి పార్టీల విధానం కాకపోతే దాడులను ఖండించాలి. లేకపోతే చేయవద్దని చెప్పాలి. ఈ రెండు పనులు కూటమి నేతలు చేయడం లేదు.

– కట్టా ఏసుబాబు, జిల్లా కార్యదర్శి, దెందులూరు

పార్వతీశ్వర శర్మకు దైవజ్ఞ భాస్కర్ బిరుదు



కాశీబొట్ల పార్వతీశ్వర శర్మను దైవజ్ఞ బిరుదుతో సత్కరిస్తున్న బ్రాహ్మణ మహా సంఘం నేతలు

భీమడోలు: అఖిల భారత బ్రాహ్మణ మహా సంఘం ఆధ్వర్యంలో కడప జిల్లా గండి వీరాంజనేయ క్షేత్రంలో నిర్వహిస్తున్న అఖిల భారత పంచాంగకర్తల విద్వత్తు సభలు నిర్వహిస్తున్నారు. ఈ సభల్లో పోలసానిపల్లికి చెందిన హంపీ పీఠ ఆస్థాన సిద్ధాంతి కాశీబొట్ల పార్వతీశ్వరశర్మకు దైవజ్ఞ భాస్కర బిరుదును సోమవారం ప్రదానం చేశారు. ఆయన హంపి పీఠ ఆస్థాన సిద్ధాంతిగా విశ్వావసు నామ సంవత్సర పండుగలు, పర్వదినాలను నిర్ణయించడంతోపాటు సిద్ధాంత రంగంలో విశేష కృషి చేసినందుకు భారతీయ సంస్కృతీ, సంప్రదాయాలను, సిద్ధాంత ధర్మాలను సంరక్షించి వ్యాప్తికి ఎనలేని సేవలందిస్తున్న పార్వతీశ్వర శర్మను బ్రాహ్మణ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇంద్రకంటి ప్రసాద్ శర్మ సిద్ధాంతి, ప్రతినిధులు దుశ్శాలువాలను కప్పి జ్ఞాపికను అందించి బిరుదుతో ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో బ్రాహ్మణ సంఘాల నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ



గణపవరం జూనియర్ కాలేజీలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ శ్రీనివాస్‌గౌడ్

గణపవరం: విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వినియోగించుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని గణపవరం ఎంఈవో పి.శేషు, ప్రభుత్వ జూనియర్ కాలేజి ప్రిన్సిపల్ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సోమవారం కాలేజీలో ఇంటర్ మీడియట్ చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన పాఠ్యపుస్తకాలను వారు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ కాలేజీల్లో ప్రవేశాల సంఖ్య మరింత పెంచడానికి కృషి చేస్తున్నామన్నారు.

వరహాలయ్యకు ఘనంగా వీడ్కోలు

భీమడోలు: భీమడోలు తహసీల్దార్ జి.వరహాలయ్య తూర్పుగోదావరి జిల్లాకు బదిలీపై వెళ్లారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అక్కడ నుంచి భీమడోలుకు బదిలీ కాగా రాష్ట్ర ప్రభుత్వం వారి సొంత జిల్లాలకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ తహసీల్దార్ జి.వరహాలయ్య ఈనెలాఖరున పదవీ విరమణ కానున్న నేపథ్యంలో ఆయన సొంత జిల్లాకు రెండు రోజుల ముందుగా జిల్లా కలెక్టర్ బదిలీ చేశారు. దీనితో సోమవారం భీమడోలు తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు. నాలుగు నెలల కాలంలో ఆయన చేసిన సేవలను కొనియాడారు. సమర్ధవంతంగా ఎన్నికలు నిర్వహణకు ఆయన ఇతర శాఖల అధికారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసారని, ఆయన పలువురికి ఆదర్శంగా నిలిచారని భీమడోలు సీఐ బీబీ రవికుమార్ అన్నారు. మరో రెండు రోజుల్లో పదవీ విరమణ చేయడంతో ఆయనను అభినందించి దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం భీమడోలు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా డిప్యూటీ తహసీల్దార్ షంషూద్దీన్ బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవో టి.స్వర్ణలత, ఎస్సై వై.సుధాకర్, వీఆర్వోలు వినయ్, కందులపాటి శంకర్, ఇంతియాఫ్, గోవింద్, సాల్మన్‌రాజు, నాగేశ్వరరావు, ప్రతాప్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



బదిలీపై వెళ్లనున్న తహసీల్దార్ జి.వరహాలయ్యను సత్కరిస్తున్న సీఐ బీబీ రవికుమార్, వీఆర్వో అసోసియేషన్ నాయకులు

విద్యాసామగ్రి పంపిణీ

భీమడోలు: ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యాబోధనను అందించి చిన్నారులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని సర్పంచ్ వెజ్జు బాలాజీ ఉపాధ్యాయులను కోరారు. సూరప్పగూడెం పంచాయతీ పరిధిలోని పాతూరు పాఠశాలలో సోమవారం విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా మిత్ర పేరుతో కిట్లను అందించారు. 3 జతల యూనిఫారం, బూట్లు, సాక్స్, బెల్ట్‌లు, టైలు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం పి.నిర్మల కుమారి, టీచర్ మండే సుధాకర్, పెద్దలు వెజ్జు హరిబాబు, వెజ్జు రాంబాబు, వి.సూరిబాబు, నాని, చైతన్య, విఘ్నేష్, షేక్ ఉమర్, నారాయణ, నాగభూషణం పాల్గొన్నారు.



పాతూరులో విద్యార్థి మిత్ర కిట్లను అందిస్తున్న సర్పంచ్ వెజ్జు బాలాజీ

భారీ వర్షాలతో వరి పైరుపై తెగుళ్ల దాడి

- సస్యరక్షణ చర్యలు పాటించాలి
- ఏడీఏ డాక్టర్ ఉషారాజకుమారి



డాక్టర్ పి.ఉషా రాజకుమారి, ఏడీఏ, భీమడోలు

భీమడోలు: అకాల వర్షాలు రైతన్నలను నట్టేట ముంచేస్తున్నాయి. ప్రతి రోజు వర్షాలు కురవడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. లోతట్టు ప్రాంతాల్లో సాగు చేస్తున్న పంట చేలు చిన్నపాటి వర్షానికే నీటమునిగిపోతున్నాయి. ఏటా సార్వాలో పంట వర్షార్పణం కావడంతో రైతులకు పెట్టుబడి సాయం రెట్టింపు అవుతోంది. దీనితో రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ ఏడాది అన్నదాతలు ఖరీఫ్ సాగును అలస్యంగా ఆరంభించినప్పటికీ అకాల వర్షాలకు నాట్లు నీట మునిగాయి. దీనితో వారం రోజుల లోపు నాట్లు నీటితో మునిగితే నీరు బయటకు తీసేసి తర్వాత మళ్లీ నాట్లు వేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. అకాల వర్షాలు రైతులను అతలాకుతలం చేస్తున్నాయి. నాట్లు వేసిన వెంటనే, పిలక దశలో ముంపుబారిన పడడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎకరాకు రూ.10 వేల నుంచి రూ.12వేల వరకు వెచ్చించి సాగు ప్రారంభించిన రైతుల కంటిపై కునుకు లేకుండా పోయింది. భీమడోలు సబ్ డివిజన్ పరిధిలోని భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు, గణపవరం మండలాల్లో 52,310 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. ఇప్పటికే 80 శాతం నాట్లు పూర్తయ్యాయి. గుండుగొలను, భీమడోలు, సాయన్నపాలెం తదితర గ్రామాల్లోని వరి క్షేత్రాల్లో నేటికీ వర్షపు నీరు నిలిచిపోవడంతో వ్యవసాయాధికారులు తగు యాజమాన్య పద్ధతులను పాటించాలని రైతులకు సూచిస్తున్నారు. రైతులు చేపట్టాల్సిన సస్య రక్షణ చర్యలపై భీమడోలు ఏడీఏ పి.ఉషారాజకుమారి సూచనలందించారు.



రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు (ఫైల్)

నారుమడి దశ

నారుమడి దశలో ఉన్న వరి పంట విత్తనం జల్లి రెండు, మూడు రోజుల వయస్సులో ఉన్నప్పుడు మూడు రోజుల కన్నా ఎక్కువగా నీటి మునిగితే మొలక శాతం గణనీయంగా తగ్గుతుంది. ఈ నేపథ్యంలో రైతులు ఈ దశలో వీలైన త్వరగా నీటిని బయటకు తీసేయాలి. దీనివల్ల విత్తనం కొరగాలి పీల్చుకుని మొలక త్వరగా వస్తుంది. అలా కాకుండా నీరు తీయడానికి వీలు లేక మొలక దెబ్బతిందంటే తిరిగి విత్తనం చల్లుకోవాల్సిన అవసరం ఉంటుంది. విత్తన 7 నుంచి 30 రోజుల మధ్యలో నారుమడి 5 రోజుల కన్నా ఎక్కువగా నీటి మునిగితే నారు దెబ్బతింటుంది. నీట మునిగిన ఐదు రోజుల లోపు నీటిని పూర్తిగా తొలగించి పంటకు గాలి తగిలేలా చూడాలి. ఐదు సెంట్ల నారుమడికి ఒక కిలో యూరియా, ఒక కిలో మ్యూరెట్ ఆఫ్ పొటాష్ వేసుకోవడం వల్ల కొత్త ఆకు వచ్చి నాట్లు వేసేందుకు అంది వస్తుంది. వర్షాల వల్ల నారుమడిలో తెగుళ్లు సోకే అవకాశం ఉన్నందున నీటిని బయటకు పూర్తి తొలగించి మొక్క నిలదొక్కుకున్న తర్వాత తెగుళ్ల నివారణకు ఒక గ్రాము కార్బొండిజమ్ లేదా రెండు గ్రాముల కార్బొండజమ్, మాంకోజెబ్ మిశ్రమంలో ఒక లీటర్ నీటికి కల్పి పైపాటిగా పిచికారి చేయాలి.

ఊడ్చిన చేలలో

ఊడ్చిన వెంటనే, పిలక దశలో ముంపుకు గురైతే నీటిని బయటకు తీసేసి పైపాటిగా ఒక ఏకరాకు 20 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్‌లను బూస్టర్ డోస్‌గా వాడాలి. నీరు పూర్తిగా తొలగించలేని పక్షంలో ఆకుపై రెండు శాతం యూరియా లేదా పొటాషియం నైట్రేట్‌ను పిచికారీ చేయడం వల్ల పైరుగా త్వరగా పుంజుకుంటుంది. వరి పూర్తిగా కోలుకున్న తర్వాత మాగుడు తదితర తెగుళ్లు సోకకుండా కార్బొండజమ్ ఒక గ్రాము లేదా రెండు గ్రాముల కార్బొండజమ్, మాంకోజేబ్ మిశ్రమం ఒక లీటర్ నీటికి కలిపి పైరుపై పిచికారీ చేయాలి.

పాఠశాలల్లో సందడిగా శుభదిన్ భోజనాలు

నిడమర్రు: ఈనెల 22వ తేదీ నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న శిక్షా సప్తాహ్ ముగింపు సందర్భంగా సోమవారం సామాజిక భాగస్వామ్య దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దాతల సహకారంతో సమకూర్చిన భోజనంతో పాటు, డొక్కా సీతమ్మ బడి భోజనం (ఎండీఎం)తో పాటు పలు రకాల స్వీట్లు, పండ్లు విద్యార్థులకు వడ్డించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో కలిసి దాతలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అధికారులు సామూహికంగా భోజనాలు చేశారు. ఈ సందర్భంగా తోకలపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈవోలు పుచ్చల శేషు, కె. రాంబాబు మాట్లాడుతూ పాఠశాలల్లో సామాజిక భాగస్వామ్యంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించవచ్చన్నారు. పెదనిండ్రకొలనులో దాత గాజుల వాసు సహకారంతో విద్యార్థులకు పెరుగు అన్నం, పండ్లు, స్వీట్స్ అందించారు. పత్తేపురం జెడ్పీ స్కూల్లో ఉప సర్పంచ్ రుద్రరాజు వెంకటేశ్వరరాజు (కొండయ్య) ఆర్థిక సహకారంతో పెరుగఅన్నం, స్వీట్స్ విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమాల్లో ఆయాగ్రామల పెద్దలు, తల్లిదండ్రులు తదితరులున్నారు.



నిడమర్రు: తోకలపల్లిలో సామూహిక భోజనాల్లో పాల్గున్న ఎంఈవోలు శేషు, రాంబాబు

సమష్టి భాగస్వామ్యంతోనే సత్ఫలితాలు

దెందులూరు: అన్ని పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమం అమలులో భాగంగా సోమవారం దెందులూరు సెయింట్ మెరిస్ యూపీ పాఠశాలలో 12 రకాలకు చెందిన 70 మొక్కలను నాటారు. జాతీయ నూతన విద్యా విధానం ప్రవేశపెట్టిన తరువాత పరివర్తనాత్మక సంస్కరణలు దేశ వ్యాప్తంగా అమలు చేయడం జాతీయ విద్యా విధానం లక్ష్యమని హెచ్‌ఎం టీనామరియా అన్నారు. మొక్కలు నాటి వాటిని సంరక్షణ బాధ్యత కూడా విద్యార్థులు, ఉపాధ్యాయులు తీసుకోవాలన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు వారి తల్లిపేరిట మొక్కలు నాటడం పాఠశాలలో ప్రత్యేకత.



భీమడోలు: పాతూరు పాఠశాలలో సహపంక్తి భోజనాలు చేస్తున్న తల్లులు, విద్యార్థులు



గణపవరం: బువ్వనపల్లి యూపీ పాఠశాలలో విద్యార్థులకు స్వీటు, పండ్లు అందిస్తున్న దాత

పెదపాడులో..

ప్రభుత్వ పాఠశాలల్లో ఎదురవుతున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం సరఫరా అయ్యేలా ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన కార్మికులు చర్యలు తీసుకోవాలని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి గుత్తా అనిల్ అన్నారు. పెదపాడు జెడ్పీ హైస్కూల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ఆయన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

కమ్మని విందు భోజనాలు

భీమడోలు: నూతన విద్యా కార్యక్రమం ఎన్‌ఈపీ అమలులోకి వచ్చి నాలుగు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన శిక్షా సప్తాహ్ కార్యక్రమాలు మండల వ్యాప్తంగా ఉత్సాభరిత వాతావరణంలో ఘనంగా జరిగాయి. ముగింపు రోజైన సోమవారం శుభ తిథి భోజనం కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానానికి అదనంగా దాతలు అందించిన పోష్టికాహార పదార్థాలు, స్వీట్లు, అరటి పండు, చికెన్ కర్రీతో చిన్నారులు విందు భోజనాలు చేశారు. దాతలను ఎంఈవో 2 అయినపర్తి భాస్కర్‌కుమార్ అభినందించారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో పండుగ వాతావరణం

గణపవరం: శిక్షా సప్తాహ్ వారోత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం నాలుగు మండలాల్లోని సుమారు 220 ప్రభుత్వ పాఠశాలల్లో దాతల సహకారంతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు ప్రత్యేక వంటకాన్ని, ఇతర పదార్థాలను వడ్డించారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో దాతలు, స్వచ్ఛంద సంస్థలు, ఉపాధ్యాయుల ఆర్థిక సాయంతో విద్యార్థులకు విందు భోజనాలు ఏర్పాటు చేశారు.

సమస్యల పరిష్కారంపై శ్రద్ధ వహించాలి



భీమడోలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు

భీమడోలు: గ్రామాల్లో అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి అధికారులు శ్రద్ధ వహించాల్సిన బాధ్యత ఉందని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. భీమడోలు ఎంపీపీ సమావేశ మందిరంలో సోమవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కె.రామయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖల వారీగా ఎమ్మెల్యే ధర్మరాజు సమీక్షలు నిర్వహించారు. మండల పరిషత్ సభ్యులు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు సక్రమంగా వైద్య సేవలు అందడం లేదని, సిబ్బంది పట్టించుకోవడం లేదని వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ ముళ్లగిరి జాన్సన్ సభ దృష్టికి తీసుకుని వచ్చారు. అంబర్‌పేటలో విద్యుత్ స్తంభాలను మార్పు చేయాలని కోఆప్షన్ సభ్యుడు ఆజామ్ కోరారు. ప్రతి సమస్యను పరిష్కరించే దిశగా పని చేస్తానని ఎమ్మెల్యే ధర్మరాజు అన్నారు. జెడ్పీటీసీ టి.భవానీ, ఎంపీడీవో టి.స్వర్ణలత, ఎంపీటీసీలు ప్రత్తి భానులక్ష్మీ, అల్తి గోపి, గొందు చైతన్య, గంటా శ్రీనివాసరావు, ఇంజేటి జూనియర్, పి.శ్రీనివాస్, సర్పంచులు పాల్గొన్నారు.